క్లుప్తంగా

ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో



కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రెండో సారి గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దు కావడాన్ని నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరాస్తాలో రాస్తారోకో, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కృష్ణ మాట్లాడుతూ.. నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పేపర్ లీకులు, పరీక్షల రద్దులు జరుగుతున్నాయని అన్నారు. కేసీఆర్ విద్యారంగాన్ని భ్రష్టు పట్టించాడని, నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారకుడవుతున్నాడని అన్నారు. నాయకులు చరణ్, ఖలీల్, భరత్, లికిత్, ప్రభు, సిద్ధు, రాకేష్ పాల్గొన్నారు.

భిక్కనూరులో..



భిక్కనూరు: నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటోందని ఏబీవీపీ స్టూడెంట్ ఫర్ సేవా కన్వీనర్ గంధం సంజయ్ అన్నారు. మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు సమీర్‌ఖాన్, చందు, శివకృష్ణ, యోగేష్, ఆదర్శ్, రాజేందర్, దత్తాత్రేయ తదితరులున్నారు.

అభినందనలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని రవీంద్ర భారతి పాఠశాలలో గురువారం వాలీబాల్ పోటీలలో రాష్ట్ర స్థాయిలో ఎంపికైన ముగ్గురు క్రీడాకారులను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సన్మానం చేశారు. రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పాఠశాల స్థాయి వాలీబాల్‌పోటీలలో ఆడేందుకు తాడ్వాయికి చెందిన మద్ది విశాల్‌రెడ్డి, పీజీ శ్రీకర్, ముదాం స్వాతిక్‌లు ఎంపికయ్యారు. పాఠశాల ప్రిన్సిపల్ ఆదిస్వామి పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో గురువారం దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను ఎంఈవో రామస్వామి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 27 మంది దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు మంజూరైనట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు కల్యాణి, శ్రీదేవి, ప్రతిభ, ఐఈఆర్‌పీలు స్వప్న, మౌనిక, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడిగా రమేశ్ రెడ్డి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన మార రమేశ్ రెడ్డి బీజేపీ మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మండల స్థాయిలో బీజేపీని బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. తనపై ఉన్న నమ్మకంతో మండల బాధ్యతలు అప్పగించిన జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా..

బీబీపేట: కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని యాడారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పోరండ్ల శ్రావణ్ కుమార్‌ను నియమిస్తూ గురువారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీని అధికారంలోకి తీసుకురావడం కోసం పాటుపడుతున్నాడని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ పెద్దలకు శ్రావణ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

ఆర్థిక సాయం

ఎల్లారెడ్డి: ఎండీఎం నిర్వాహకులకు మదన్‌మోహన్ వర్గం నాయకులు గురువారం ఆర్థిక సాయం అందించారు. ఎండీఎం నిర్వాహకులు వారి డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కొద్ది రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నారు. వీరికి ఖర్చుల నిమిత్తం మదన్‌మోహన్ ఆర్థిక సహాయాన్ని పంపడంతో మదన్‌మోహన్ వర్గానికి సంబంధించిన నాయకులు ఎండీఎం నిర్వాహకులకు ఆర్థిక సహాయాన్ని అందించారు.

ఫిజియోథెరపి క్యాంపును వినియోగించుకోండి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే ఉచిత ఫిజియోథెరపి క్యాంపును వినియోగించుకోవాలని మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు గునిగెరి హన్మాండ్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఫిజియోథెరపి క్యాంపులో పిల్లలకు ఇంటి వద్ద చేయాల్సిన వ్యాయమాలు చేయించి చూపించారు. ఫిజియోథెరపిస్టు మనీషా, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

- కంచెలు ఏర్పాటు చేయాలని కోరుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ ఎదురుగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల ఆవరణలో కంచె లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలో పలు చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కంచెలు లేకుండా ప్రమాదకరంగా మారాయి. పోలీస్ స్టేషన్ ఎదురుగా ఎల్లారెడ్డి–బాన్సువాడ రహదారి పక్కన, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో సైతం కంచె లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందు జాగ్రత్తగా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మూగ జీవాలకు విద్యుత్ షాక్ తగలకుండా తగిన ఏర్పాట్లు చేయాలి.

త్వరలోనే కంచెలు ఏర్పాటు చేస్తాం

పట్టణంలోని కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేశాం. ప్రమాదాలు జరగకుండా మిగిలిన వాటికి కూడా త్వరలోనే కంచెలు ఏర్పాటు చేస్తాం. ప్రజలు కూడా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వైపు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– సత్యనారాయణ, ఏఈ, ట్రాన్స్‌కో, ఎల్లారెడ్డి

ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణ



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ పోచారం



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

బాన్సువాడ రూరల్: తాడ్కోల్ గ్రామం బాన్సువాడ–బిచ్కుంద ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని గురువారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. యువకులు కాషాయ జెండాలు ఎగురవేసి, పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అంతకు ముందు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, స్పీకర్ సోదరుడు శంభురెడ్డితో కలిసి తాడ్కోల్‌లో రూ.48 లక్షల ప్రభుత్వ నిధులతో నిర్మించిన రెడ్డి సంఘం కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. రెడ్డి సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు క్రిష్టారెడ్డి, పిట్ల శ్రీధర్, పాతబాలక్రిష్ణ, అన్నారం వెంకట్రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి

బాన్సువాడ: ప్రతి ఒక్కరు ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిమల్ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం తాడ్కోల్‌లో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. బీజేపీ నాయకులు కొత్తకొండ భాస్కర్, చిదరి సాయిలు, శ్రీనివాస్, కోనాల గంగారెడ్డి ఉన్నారు.

గత తీర్మానాలకు మోక్షమే లభించలేదు



మాట్లాడుతున్న భిక్కనూరు ఎంపీపీ గాల్‌రెడ్డి



వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎంపీటీసీలు

- మండల సభలో రామేశ్వర్‌పల్లి ఎంపీటీసీ చంద్రకాంత్ రెడ్డి
- అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం

భిక్కనూరు: మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. ఎంపీపీ గాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామేశ్వర్‌పల్లి ఎంపీటీసీ సభ్యుడు చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గత సమావేశంలో చేసిన తీర్మానాలు ఇప్పటికీ పరిష్కారం కాలేవని పేర్కొన్నారు. అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మండల కేంద్రం నుంచి రాజంపేట వరకు డబుల్ రోడ్డు నిర్మించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు పనులు ఎందుకు జరగడం లేదని అడిగారు. దళితబంధు, బీసీ బంధు అధికార పార్టీకి చెందిన వారికే దక్కుతున్నాయని ఆరోపించారు. దీంతో అధికార పార్టీకి చెందిన పలువురు ఎంపీటీసీలు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులకే దక్కుతున్నాయంటూ తిప్పాపూర్, పెద్దమల్లారెడ్డి ఎంపీటీసీలు సాయిరెడ్డి, సాయాగౌడ్‌లు పేర్కొన్నారు. ఇరువురి మధ్యన కొంతసేపు వాగ్వాదం నడిచింది. లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల్లో జరగాలని మల్లుపల్లి ఎంపీటీసీ మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. తిప్పాపూర్ గ్రామాన్ని రాజంపేట పీహెచ్‌సీ పరిధి నుంచి భిక్కనూరు పీహెచ్‌సీ పరిధిలోకి మార్చాలని ఎంపీటీసీ సాయిరెడ్డి కోరారు. సభలో వైస్ ఎంపీపీ యాదగిరి, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో అనంతరావ్, ఎంపీవో ప్రవీణ్, పాల్గొన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి



పన్నులు వసూలు చేస్తున్న ఎంపీవో మలహరి

కామారెడ్డి రూరల్: గ్రామ పంచాయతీల్లో ఈ నెలాఖరు వరకు వంద శాతం పన్నులు వసూలు చేయాలని గ్రామ కార్యదర్శులకు ఎంపీవో మలహరి ఆదేశించారు. గురువారం తిమ్మక్‌పల్లి, నర్సన్నపల్లి గ్రామాల్లో పర్యటించారు. అలాగే గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ చెత్తను పడవేయవద్దన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అంతేకాకుండా ప్రతి శుక్రవారం డ్రైడే సందర్భంగా వాటర్ ట్యాంక్‌లను శుభ్రంగా కడిగి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. కార్యదర్శులు శ్రీనివాస్, అనిల్, కారోబార్ రమేష్‌లు ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి



తాడ్వాయిలో సమ్మె చేస్తున్న ఆశావర్కర్లు

సాక్షి నెట్‌వర్క్: తమకు కనీస వేతనం రూ.18వేలు చెల్లించడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా కార్యకర్తలు చేపడుతున్న సమ్మె జిల్లా వ్యాప్తంగా గురువారం కూడా కొనసాగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, పదవీ విరమణ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. పలువురు సంఘీభావం తెలిపారు.

బీజేపీలో ఆరేపల్లి గ్రామ యువకుల చేరిక



కామారెడ్డి టౌన్: మాచారెడ్డి మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన యువకులు గురువారం బీజేపీలో చేరారు. కామారెడ్డి అసెంబ్లీ బీజేపీ ఇన్‌ఛార్జి కాటిపల్లి వెంకటరమణ రెడ్డి వారికి పార్టీ జెండాలను వేసి బీజేపీలోకిఆహ్వానించారు.

గ్రామాల్లో తుది ఓటరు జాబితా ప్రదర్శన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని వివిధ గ్రామాలలో గల పోలింగ్ కేంద్రాలలో గురువారం అధికారులు తుది ఓటరు జాబితాను ప్రదర్శించారు. వదల్‌పర్తి పోలింగ్ కేంద్రంలో తహసీల్దార్ మహేందర్ కుమార్, ఎంపీడీవో రఘు తుది ఓటరు జాబితాను ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డితో కలిసి ప్రదర్శించారు. పేర్లలో మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తు చేసుకున్నవారు తుదిజాబితాలో చూసుకోవాలన్నారు. సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి అజీమొద్దీన్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



పిట్లం(జుక్కల్): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డిలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నేతలు వాసరి రమేష్, విజయ్, ఏఎంసీ చైర్మన్ సావిత్రి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని పలు గ్రామాల్లో 76 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను స్థానిక ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. సర్పంచుల ఫోరం అధ్యక్షుడు తిర్మల్ రెడ్డి, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, నాయకులు గుండేరావు పాల్గొన్నారు.

గృహలక్ష్మి ప్రొసీడింగ్ కాపీలు..

పిట్లం(జుక్కల్): స్థానిక ఏఎంసీ కార్యాలయంలో గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను గురువారం బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ సావిత్రి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పోడు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న కాసుల బాలరాజ్

బాన్సువాడ రూరల్: నియోజకవర్గంలోని అర్హులైన వారి పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు కాసుల బాలరాజు డిమాండ్ చేశారు. గురువారం సంగోజీపేట్‌కి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమకు అనుకూలమైన వారికి మాత్రమే పోడు పట్టాలిచ్చి బీఆర్ఎస్ నేతలు చేతులు దులుపుకున్నారని విమర్శించారు. నాయకులు అబ్దుల్ ఖాలేక్, ఉద్దర హన్మాండ్లు, కేతావత్ రూప్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డికి కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

బాన్సువాడ: బాన్సువాడలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, మంత్రి వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన బాన్సువాడలో మాట్లాడారు. ఈ నెల 4న బాన్సువాడకు వచ్చిన పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని, కాంగ్రెస్ పార్టీ ముసలి పార్టీ అని సంబోధించడం సమర్థనీయం కాదన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం



రాజంపేటలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

రాజంపేట: మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను గురువారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ప్రారంభించారు. గ్రామంలోని సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సంఘ భవనాలు, హైమాస్ట్ లైట్లతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎంపీపీ స్వరూప, జెడ్పీటీసీ కొండ హన్మాండ్లు, సర్పంచ్ ఆముద సౌమ్య, మండల అధ్యక్షులు భిక్యాజీ బల్వంతరావ్, తదితరులు పాల్గొన్నారు.

నర్సన్నపల్లిలో గోదాం..

కామారెడ్డి రూరల్: నర్సన్నపల్లి శివారులో రూ.25 కోట్ల 22 లక్షల రూపాయలతో నిర్మించిన గోదాములను గురువారం ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ ప్రారంభించారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దిన్, ఎంపీపీలు పిప్పిరి ఆంజనేయులు, లోయపల్లి నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

‘మృతిచెందిన వారి పేర్లతో డబ్బులు డ్రా చేశారు’



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. 2021 నుంచి మార్చి, 2023 వరకు గ్రామ పంచాయతీలలో జరిగిన 3 కోట్ల 90 లక్షల 93 వేల 683 రూపాయల ఉపాధి హామీ పనులపై క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన వివరాలను గురువారం అధికారులు వెల్లడించారు. పంచాయతీల వారీగా డీఆర్పీలు వెల్లడించిన వివరాలను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాయన్న, ఫైనాన్స్ మేనేజర్ రాంనారాయణ నమోదు చేసుకున్నారు. పలు గ్రామాల్లో మృతి చెందిన కూలీల పేర్లపై, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లపై పని చేసినట్లు చూపి వేతనాలు డ్రా చేసినట్లు గుర్తించారు. మస్టర్లు, రికార్డుల్లో ఉన్న తప్పులను వెల్లడించారు. నిబంధనలు పాటించని ఏపీఎం సుదర్శన్‌పై జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాయన్న ఆగ్రహం వ్యక్తం చేశారు.

‘ప్రమోషన్లు ఇచ్చి బదిలీ చేయాలి’



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న డీటీఎఫ్ నేతలు

కామారెడ్డి అర్బన్: టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చి బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌సీ ప్రభాకర్, దేవులా మాట్లాడుతూ.. ఇప్పటికే బదిలీలు పొందిన ఎస్ఏలను వెంటనే రిలీవ్ చేయాలని, న్యాయ వివాదాలను పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, 15 శాతం డీఏను మంజూరు చేయాలని కోరారు. నాయకులు విజయరామరాజు, బాలయ్య, గంగారాం, సరోజినీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత పాయింట్లు వేయాలని డీఈవోకు వినతి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల్లో భాగంగా కొందరు ఉపాధ్యాయులకు ప్రాధాన్యత పాయింట్లు జమ కాలేవని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం డీఈవో ఎస్.రాజుకు అభ్యంతరాలను విన్నవించుకున్నారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పంపరి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రవీణ్, రాజశేఖర్, నర్సయ్య, కల్యాణి, రాధిక, నీలిమ, ప్రవీణ, కవిత, సుప్రియ, సూర్యలకు ప్రాధానత్య పాయింట్లు జమ కాలేవని అభ్యంతరాల్లో పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు రాజేష్ తదితరులున్నారు.

జీపీలకు క్రీడా కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న పోచారం సురేందర్‌రెడ్డి



దోమకొండలో..



నిజాంసాగర్‌లో..



నాగిరెడ్డిపేటలో ..

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు క్రీడా కిట్లను పంపిణీ చేశారు. కిట్లను సర్పంచ్, కార్యదర్శులకు అధికారులు అందించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని, యువకులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. యువకులు క్రీడల్లో రాణించడానికి ప్రతీ గ్రామ పంచాయతీకి ప్రభుత్వం కిట్లు పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు. క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, షాట్‌పుట్, జిమ్ పరికరాలు, డిస్కస్‌త్రో పాటు పలు క్రీడలకు సంబంధించిన కిట్లను అందజేసినట్లు చెప్పారు.

సంక్షిప్తం

సబ్ స్టేషన్ తనిఖీ

గాంధారి(ఎల్లారెడ్డి): ట్రాన్స్‌కో సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు గురువారం గాంధారి సబ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఈ రమేష్‌బాబు ఉన్నారు.

కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలి

కామారెడ్డి టౌన్: అసెంబ్లీ సాక్షిగా పోడు భూముల రైతులందరికి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిన సీఎం కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమా పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో అటవీ హక్కు చట్టాలను అమలు చేయాలని ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు.

స.హ చట్టంపై విద్యార్థులకు అవగాహన

కామారెడ్డి టౌన్/కామారెడ్డి అర్బన్: సమాచార హక్కు 18వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సహ చట్టం పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం, హెచ్‌ఎం నరహరి రాజు, ప్రతినిధులు ప్రదీప్, శ్రీనివాస్ ఉన్నారు.

సీఎం కేసీఆర్‌కు పోస్టు కార్డుల ద్వారా వినతి

కామారెడ్డి టౌన్: ఈ– పంచాయతీ టెక్నికల్ విభాగంలో పని చేస్తున్న డీపీఎం, ఆపరేటర్లు గురువారం సీఎం కేసీఆర్‌కు పోస్టు కార్డుల ద్వారా విన్నవించుకున్నారు. తమకు పేస్కేల్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్‌లతో రాసిన పోస్టు కార్డులను మున్సిపల్ ముందు పోస్టల్ బాక్స్‌లో కేసీఆర్‌కు పంపారు.

కేవైసీ నమోదుకు గడువు పెంపు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రేషన్‌కార్డులోని లబ్ధిదారుల కేవైసీ నమోదుకు గడువు పెంచినట్లు నాగిరెడ్డిపేట తహసీల్దార్ మహేందర్‌కుమార్ తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 31వరకు రేషన్‌కార్డులోని లబ్ధిదారులు కేవైసీ నమోదు చేసుకునేందుకు గడువు పొడిగించారని ఆయన చెప్పారు.

మేరీ మాటీ–మేరా దేశ్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని ప్రతి గ్రామంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మేరీ మాటీ–మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్ సునీల్ రాథోడ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎంపీపీ పాల్త్య విఠల్, సర్పంచ్‌లో అరిగె సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ పాదయాత్ర వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

కామారెడ్డి టౌన్: ఎస్సీ వర్గీకరణ కోసం ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ చేపడుతున్న పాదయాత్ర వాల్ పోస్టర్లను గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద నేతలు ఆవిష్కరించారు. రేపు అలంపూర్‌లో పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పురుషోత్తం తెలిపారు.

వడ్డెర సంఘం ఆత్మీయ సమ్మేళనం..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో వడ్డెర ఆత్మీయ సమ్మేళనం వాల్ పోస్టర్లను సంఘం నాయకులు నాగయ్య, కిషన్ తదితరులు కలిసి ఆవిష్కరించారు. ఆత్మీయ సమ్మేళనం 8న పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు, అతిథిగా ఎమ్మెల్యే జాజాల సురేందర్ హాజరుకానున్నట్లు వారు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం.మధుసూధన్ (ACO) : 99510 27699
డి.యల్.ఎన్.గౌడ్ (ఎల్లారెడ్డి) : 95731 30288
కె.రాజు (కామారెడ్డి) : 99496 99861
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899